మ్యాన్‌హోల్ పరిశీలన

మాదాపూర్, మార్చ్ 4: కొండాపూర్ డివిజన్ మార్తాండనగర్‌లో మ్యాన్ హోల్ లీకేజీ కావడంతో బోర్ నీటిలో కలిసి కలుషితమవుతున్నాయని మంగళవారం నమస్తే తెలంగాణలో 'బోరు నీటిలోకి డ్రైనేజీ వాటర్' శీర్షికతోతో ప్రచురితమైన కథనానికి స్పందించిన జలమండలి అధికారులు సీజీఎం ఎస్ఆర్ నగర్ నారాయణ, ఆర్ డబ్ల్యూహెచ్ఎస్ ఓఎస్డీ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ సత్యనారాయణ, దుర్గం చెరువు జలమండలి జీఎం బ్రిజేశ్, డీజీఎం శరత్ కుమార్ రెడ్డి, మేనేజర్ సందీప్ సిబ్బందితో కలిసి మంగళవారం మ్యాన్‌హోల్‌లను పరిశీలించారు. సిబ్బంది మరమ్మతులు చేపట్టి చెత్త చెదారాన్ని తొలగించారు. కాలనీలలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తలెత్తినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్ : మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ దీప్తి తెలిపారు. 11 కె.వి.మార్తాండ నగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11 కె.వి. హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ప్రకాశ్ నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11 కె.వి. ఆదిత్య ఇంపీరియల్ హై ట్స్ పరిధిలో ఆదిత్య ఇంపీరియల్ హై ట్స్, ప్రకాశ్ నగర్, వినాయక నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సా యంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న చందానగర్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

దుండిగల్, మార్చి 4: ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ తెలిపారు. 2020లో ఎల్ఆర్ఎస్‌కు చేసుకున్నవారు ఈనెల 31లోగా సంబంధిత ఫీజును చెల్లించి తమ ప్లాట్‌ను క్రమబద్ధీకరించుకుంటే ప్రభుత్వం విధించిన ఫీజులో 25% రాయితీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 4219 దరఖాస్తులు రాగా 2769 దరఖాస్తులకు పరిష్కారం లభించిందని, మిగతా 1450 ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తుదారులు సకాలంలో రుసుం చెల్లించాలని తెలిపారు. వివరాలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గాని, 9618588397 నంబర్లో గాని సంప్రదించాలన్నారు.

మియాపూర్ : అనధికారిక ప్లాట్లు ,లే ఔట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్ ఫీజు రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చందానగర్ సర్కిల్ డీసీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తన చాంబర్లో మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో డీసీ సమావేశం నిర్వహించారు. హెల్ప్‌డెస్క్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఇతర సేవలను అందిస్తారని డీసీ స్పష్టం చేశారు. కొత్తగా ఎటువంటి ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి. టీపీ ఎస్ శ్రీనివాస్ రెడ్డి, చైన్‌మెన్ , సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ సేవలు

మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను కలిసి సమస్యలు వివరిస్తున్న యువకులు.

దుండిగల్, మార్చి 4: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. మంగళవారం శంభీపూర్ లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, సంక్షేమ సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు కలిశారు. వారు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. స్పందించిన ఆయన ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో లో వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర..

దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం జాతర మహోత్సవం తెలంగాణ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. సాయంత్రం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి బోనాలు సమర్పించారు. వేడుకల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, పుర ప్రముఖులు ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. దైవచింతన తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఈ సందర్భంగా శంభీపూర్ కృష్ణ పేర్కొన్నారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్ట్ సిగ్గుచేటు

మేడ్చల్ కలెక్టరేట్ : సమస్యల పరిష్కారం కోసం నగరంలో ప్రజాదర్బార్‌కు వెళుతున్న అంగన్‌వాడీలను అరెస్ట్ చేయడం విచారకరమని సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ అన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడుతూ.. సంవత్సర కాలంగా వేతనాలు లేకుండా పనిచేశారని, అయినప్పటికీ వాళ్ల వేతనం కోసం అడగటానికి వెళ్లిన వారిని అరెస్టు చేయించడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు.

మళ్లీ మొదలైన తాగునీటి కష్టాలు

అల్లాపూర్, మార్చి4: అరకొర జరుగుతున్న తాగునీటి సరఫరాతో జనం అవస్థలకు గురవుతున్నారు. అల్లాపూర్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో రెండు మూడు నెలలుగా సమస్య కొనసాగుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోపోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాయత్రి నగర్, వివేకానందనగర్, తులసి నగర్, అల్లాపూర్, జనప్రియ నగర్ ప్రాంతాలకు బోరబండ సెక్షన్ నుంచి తాగునీరు సరఫరా అవుతున్నది. పదివేలకు పైగా కనెక్షన్లు ఉండడంతో రోజు విడిచి రోజు గంటసేపు నీటిని వదులుతారు. రెండు మూడు నెలలుగా పలు కాలనీలలో ప్రెజర్ తో నీళ్లు సరఫరా అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. పైనుంచి నీళ్లు తక్కువగా వస్తున్నాయని సిబ్బంది సమాధానం ఇస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో రిజర్వాయర్ నిర్మాణం

2014 కు ముందు అల్లాపూర్‌లో ఏ కాలనీ చూసినా తాగునీటి సరఫరా లేక, మహిళలు ఖాళీ బిందెలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018లో అల్లాపూర్‌కు ఎగువనున్న బోరబండ సైడ్ -3 లో భారీ రిజర్వాయర్ నిర్మించారు. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. రిజర్వాయర్ ద్వారా అల్లాపూర్ డివిజన్ తో పాటు బోరబండ డివిజన్ కూడా తాగునీటి సరిపడా సరఫరా జరుగుతుంది. ఆరు నెలలుగా తాగునీటి సరఫరా పాక్షికంగా జరగడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పైనుంచి నీళ్లు తక్కువగా వస్తున్నాయని, అందువల్లే సరిపడా నీరు సరఫరా చేయలేకపోతున్నామని జలమండలి సిబ్బంది చెబుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఇక గాయత్రి నగర్ వంటి కాలనీలో గతంలో సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల లోపు నీటి సరఫరా జరిగేది. డిసెంబర్ నుంచి రాత్రి 9 గంటలు దాటాక ఏ అర్ధరాత్రికో గాని నల్ల నీళ్లు వస్తాయో..? అని రాత్రంతా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. నల్లా నీళ్లు వదలడంలో సమయపాలన పాటించకపోవడం, లో ప్రెషర్, మరికొన్ని చోట్ల కలుషిత నీరు సరఫరా కావడంతో గుక్కెడు నీళ్ల కోసం పడరాని కష్టాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటు పోతున్నాయి,మరోవైపు తాగునీటి సరఫరా లో ఇబ్బందులు. అటు వాడుకునే నీళ్లు ఇటు తాగే నీళ్లు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇంకా వేసవికాలం ప్రారంభం కాకముందే తమకు నీటి కష్టాలు మొదలయ్యాయని జనం గగ్గో పెడుతున్నారు. మాయదారి కాంగ్రెస్ పాలనలో తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో పాల్గొనడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వినియోగదారులకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బాలానగర్ : ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నామని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం అంజయ్యనగర్‌లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. అంజయ్యనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రహరీ నిర్మాణం చేపట్టి ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, ఎం.అశోక్, ఎం.సత్యనారాయణ, ఉమ, వాణి, గంగమ్మ, బాలరాజ్, నగేశ్, మధుకర్, నరసింహ, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనం

జగద్గిరిగుట్ట : ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతోందని సీపీఐ నాయకులు అన్నారు. జగద్గిరిగుట్ట కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ .. ఎమ్మెల్సీ స్థానాలు కోల్పోవడం ప్రజల్లో వస్తున్న మార్పుకు సంకేతం అన్నారు. ఇప్పటికైనా హామీలు నెరవేర్చి దిశగా పనిచేయాలన్నారు. కబ్జాదారులకు కాంగ్రెస్ నాయకులు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. పాత పెన్షన్ విధానం, చెరువుల సంరక్షణ, రైతుబంధు, రుణమాఫీ అమలు చేయాలని సూచించారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

జీడిమెట్ల : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని రాష్ట్ర వ్యాప్త సమ్మె సన్నాహక సందర్భంగా మంగళవారం జీడిమెట్ల డిపో వద్ద ఆర్టీసీ కార్మిక జేఏసీ జీడిమెట్ల డిపో ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. జేఏసీ నాయకులు వెంకన్న, మౌలానా, కమలాకర గౌడ్, బాబు, గోవర్ధన్, అశోక్, హరికిషన్, డానియల్ పాల్గొన్నారు. 2021 వేతన సవరణ చేసి, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. డ్రైవర్, కండక్టర్, నియామకాలు, కొత్త బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీని బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

రెండు నూతన 11 కేవీ ఫీడర్లు ఏర్పాటు

కుత్బుల్లాపూర్ : విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్ఈ రవికుమార్ అన్నారు. దూలపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన 11 కేవీ 2 ఫీడర్లు ప్రారంభించారు. సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్నామన్నారు. కార్యక్రమంలో పోతరాజు జాన్, ఏ డీ ఈ శ్రీకాంత్, ఏఈ శ్రీనివాసులు, లైన్ టీం అధికారులు, సిబ్బంది, దూలపల్లి పారిశ్రామిక అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'అధికారులు విఫలమవుతున్నారు'



మూసాపేట డీసీ వంశీకృష్ణకు వినతి పత్రానందిస్తున్న బీజేపీ నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జీ వినోద్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం మూసాపేట డీసీ వంశీకృష్ణకు బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కాలనీలో పలుచోట్ల విద్యుత్ విధి దీపాలు వెలగడం లేదని, పార్కులలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్వీస్ రోడ్డు లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. పజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమశేఖర్ , భగవంత్ రెడ్డి, వేణుగోపాల్, సత్యనారాయణ, సంతోష్, ప్రేమ్, అర్జున్, జగదీశ్ ,రేణుక పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితోనే.. ఫ్లైఓవర్ నిర్మాణం

కొండాపూర్, మార్చి 4 : అందుబాటులోకి రానున్న లింగంపల్లి ఫ్లైఓవర్‌కు తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రో. జయశంకర్ సార్ పేరును పెట్టాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాడు సీఎంగా కేసీఆర్ చేసిన కృషి ఫలితంగా లింగంపల్లి ఫ్లైఓవర్ పనులు ప్రారంభం అయ్యాయని గుర్తు చేశారు. కేంద్రాన్ని ఒప్పించి లింగంపల్లి ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రయత్నం చేసారని రవీందర్ యాదవ్ అన్నారు. సార్ పేరును పెట్టి తెలంగాణపై తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

మియాపూర్ : పట్నంలో పాలమూరు బిడ్డలు సొజన్యంతో వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ లోని పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం వ్యవస్థాపక సభ్యులు ఎంఏ. కరీం, గోపాస్ రవీందర్, కుమార్, గోపాస్ చంద్రశేఖర్, బంగారి శ్రీను, శ్రీకాంత్, వాసన్ ఐ కేర్ సిబ్బంది బాల శివ కుమార్, ఆష్టమాల జిస్ట్ జాకీర్, సుశాంత్ పాల్గొన్నారు.

టీఎన్జీవో కాలనీలో అక్రమ నిర్మాణాలు సీజ్

శేరిలింగంపల్లి : గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలో అనుమతి లేకుండా అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరఢా ఝుళిపించారు. గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో గ్రేటర్ ఖజానాకు గండికొడుతూ అనుమతి లేకుండా చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలను మంగళవారం సీజ్ చేశారు. మొత్తం 14 నిర్మాణాలను హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో సీజ్ చేసి బ్యానర్లను ఏర్పాటు చేశారు. వివరాలు ఇలా .. గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలో తెలంగాణ సెక్రటేరియట్ నాన్ గెజిటెడ్ హైకోర్టు ఉద్యోగులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలను కేటాయించింది. ఉద్యోగుల కోసం కేటాయించిన స్థలాలతో టీఎన్జీవో కాలనీ లేఅవుట్ ను ఏర్పాటు చేశారు. ఇక్కడి స్థలాల్లో కొంతకాలంగా అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. జీ ప్లస్ టూఅనుమతి ఉన్న సదరు ప్లాట్లలో ఏకంగా 6, 7 అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పూర్తిగా రెసిడెన్షియల్ కాలనీ అయిన టీఎన్జీవో కాలనీలో కమర్షియల్ భవనాలు, హాస్టల్ లు, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. ఈ విషయమై ఎన్నో ఫిర్యాదులు రావడంతో పాటు పలువురు టీఎన్జీవో కాలనీ అక్రమ నిర్మాణాలపై కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. గతంలోనే ఇక్కడి అక్రమ నిర్మాణాలపై సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను గుర్తించారు. మంగళవారం సదరు అక్రమ నిర్మాణాలను సీజ్ చేసి బ్యానర్లను ఏర్పాటు చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ.. టీఎన్జీవో కాలనీలో జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజ్ చేసిన భవనాల్లో పనులు చేపట్టవద్దని.. పనులు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో అక్రమ నిర్మాణాలను పోలీసుల బందోబస్తు మధ్య సీజ్‌చేస్తున్న సర్కిల్ అధికారులు

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి రైతుబజార్‌లో మంగళవారం ధరలు (కేజీ - రూపాయలు) టమాట 13, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 21, కాకర 38, బీర 38, క్యాబేజీ 10, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 20, దొండ 40, చిక్కుడు 45, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 33, ఆలుగడ్డ 20, కీరా 18, దోస 25, సోర 15, పొట్లకాయ (1) 20, కంద 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 34, మామిడి (1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడి 30, నిమ్మకాయలు(12) 40 నుంచి 50, మునగ (1) 8 నుంచి 10, పచ్చి బఠానీ 40, పొప్పడి 40, పుట్ట గొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 180, అల్లం 80, వెల్లుల్లి 140, చింత పండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

తీర్పు వచ్చేవరకు ఫెన్సింగ్ వేయొద్దు

మాట్లాడుతున్న ప్రశాంత్ నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

మియాపూర్ : సర్వే నం. 92,93,94,96,97,98, 100లో ఉన్న స్థలాలపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తుందని, కోర్టు తీర్పు వచ్చే వరకు తమ స్థలాల చుట్టూ హెచ్ఎండీఏ అధికారులు ఫెన్సింగ్ వేయవద్దని ప్రశాంత్‌నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు అధికారులను కోరారు. మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి, హెచ్ఎండీఏ కమిషనర్‌లకు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు సర్వే నం. 100లోని 40 ఎకరాలతో ఒక లేఅవుట్, సర్వే నం.100తో పాటు 92,93,94,95,97,98లలో 30 ఎకరాలతో మరో లేఅవుట్ చేయగా, వీటిని1990,1991లలో హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చింది. 2003లో సర్వే నం. 100,101లోని 550 ఎకరాలు ప్రభుత్వ భూమి అని ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసిందని, ఇందులో 40 ఎకరాల భూమి ప్రశాంత్‌నగర్‌కాలనీకి చెందినదిగా ప్రభుత్వం తరుపున హెచ్ఎండీఏ పంచనామా చేసిందన్నారు. మిగిలిన 236 ఎకరాల భూమి ప్రభుత్వంకు చెందినదిగా గుర్తించారని ప్రస్తుతం ఈ స్థలం హుడా ఆధీనంలో ఉందని శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ నర్సింహులు, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్- ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతో పాటు డిగ్రీ కోర్సుల సప్లమెంటరీ రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

పీహెచ్ డీ సబ్మిషన్ గడువు పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని 2018 బ్యాచ్ పరిశోధక విద్యార్థులు థీసెస్ సమర్పించేందుకు గడువును ఏడాది పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసిం ది. ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య ఒక ప్రకటన విడుదల చేశారు. 2018 పరిశోధక విద్యార్థుల ప్రవేశాలు 2019 వరకు సాగాయన్నారు. కరోనాతో రెండేళ్ల కాలా న్ని పరిశోధకులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెలోషిప్ లేక పరిశోధనలు ముందుకు సాగలేదని వాపోయారు. యూజీసీ రెండేండ్లు పొడిగించినప్పటికీ ఓయూ పాటించడం లేదని మండిపడ్డారు. గడువుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల గ్రామీణ పేద విద్యార్థులు నష్టపోతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు.

బాలానగర్, మార్చి 4 : బాలానగర్ డివిజన్ పరిధి చెర బండ రాజు నగర్ లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ హాజరయ్యారు. ఆయన పూజలు చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్వాతి, శివరంజని, తులసి, సోని, నరసింహ, కృష్ణ యాదవ్, లచ్చ గౌడ్, మురళీధర్, క్రరే జంగయ్య, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.